

'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకుంటేనే...

- గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అనుమతి
- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ 8



రుణ పునరుద్ధరణ బంగారమాయేనా!



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

గోల్డ్‌లోన్ (బంగారు ఆభరణాలపై రుణాలు) తీసుకున్న రైతులు బ్యాంకర్ల షరతులతో బెంబేలెత్తిపోతున్నారు. రుణ పునరుద్ధరణ (రెన్యువల్) సమయంలో అసలుతో పాటు వడ్డీ పూర్తిగా చెల్లించకపోతే బ్యాంకర్లు రెన్యువల్ చేయడం లేదు. దీంతో రెన్యువల్ గడువు దాటితే డిఫాల్టర్‌గా మిగిలిపోతామనే ఆందోళనతో రైతులు బ్యాంకు అప్పు తీర్చేందుకు మళ్లీ ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల కోసం ప్రైవేటు వ్యాపారులు భారీగా వడ్డీ వసూలు చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాత విధానంలో వడ్డీ చెల్లిస్తే గోల్డ్‌రుణం రెన్యువల్ చేసేవారు. అయితే ఇటీవల కాలంలో ఆర్‌బీఐ కొత్త నిబంధనలను తీసుకరావటంతో బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రుణం తీసుకున్న రైతులు మొత్తం చెల్లించిన తరువాతే రెన్యువల్ చేయాలనే నిబంధన పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గోల్డ్ లోన్లు తీసుకున్న రైతుల వెతలు

- బ్యాంకుల నిబంధనలతో తీవ్ర ఇబ్బందులు
- అసలు, వడ్డీ చెల్లించకుంటే రెన్యువల్ చేసేది లేదని షరతులు
- రుణం పూర్తిగా చెల్లించేందుకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు
- రెండు వైపులా అధిక వడ్డీభారంతో రైతుల కష్టాలు
- గోల్డ్‌లోన్ విధానంలో పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి

పెట్టుబడికి బంగారు రుణాలు

రైతులు పెట్టుబడికి ప్రధానంగా బ్యాంకులపైనే ఆధార పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీబీతో పాటు వివిధ జాతీయ, రాష్ట్రీయ బ్యాంకుల్లో సుమారు రూ.5వేల కోట్లకు పైగా గోల్డ్ లోన్లు, క్రాఫ్‌లోన్లు, ఇతర రైతుల రుణాలు ఉన్నాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాలోనే 2024-25లో రూ.2,643కోట్లు, ములుగు జిల్లాలో రూ.591.62కోట్ల వరకు రైతులకు వివిధ రకాల రుణాలు ఇచ్చినట్లుగా అంచనా. వీటితోపాటు భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలోనూ బంగారం తాకట్టు పెట్టి భారీగా రుణాలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అనుకున్నదాని కంటే అధికంగా పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. దీంతో భూముల తాకట్టుతో పాటు బంగారు అభరణాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేయాల్సి వస్తోంది. బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేయటంతో చాలామందికి ఇది కూడా ఓ ఆశగా మారింది. ప్రధానంగా ఎక్కువగా కౌలు రైతులు గోల్డ్ లోన్ వైపు మొగ్గు చూపుతున్నారు. పాస్‌బుక్‌లు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పులు తీసుకునేందుకు భూ యాజమానులు ఒప్పుకోకపోవటంతో.. కౌలు రైతులు బంగారు అభరణాలను తాకట్టు పెడుతున్నారు. ఎక్కువ మొత్తంలో వ్యవసాయం చేసే రైతులకు రూ.లక్ష నుంచి రూ.20లక్షల వరకు కూడా పెట్టుబడి అవసరం ఉండటంతో అప్పులు చేస్తున్నారు. అయితే ఒక రైతుపై (మిగతా 7లో..)


గూడూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం క్యూ

ఒక్క బస్తా దొరికినా చాలంటున్న రైతులు

- పీఏసీఎస్‌ల ఎదుట బారులు
- గూడూరు సొసైటీ వద్ద రాత్రుళ్లు నిద్ర
- జిల్లా వ్యాప్తంగా అన్నదాతల అగచాట్లు
- స్వయంగా రంగంలోకి దిగిన కలెక్టర్, ఎస్పీ

మహబూబాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి.. జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి.. ఏరువాకకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇక వేసే పంటలకు దిగులు లేదు. దిగుబడులు గ్యారెంటీ అని మురిసిపోయారు. చివరికి వేసిన పంటలకు యూరియా కొరత ఏర్పడింది.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మూడ్రోజుల నుంచి ఎక్కడ చూసిన యూరియా కోసం తండ్లాడుతున్నారు. ఎక్కడ చూసినా.. క్యూలైన్‌లు.. చెప్పుల వరుసలు కన్పిస్తున్నాయి. ఓ వైపు సొసైటీల వద్ద రాత్రుళ్లు పిండి బస్తాల కోసం నిద్రిస్తున్నారు. ఒకవైపు చెదురు.. మొదురు నుంచి ఓ మోస్తారుగా మారుతున్న వర్షం.. అక్కడక్కడ భారీగానే కురుస్తోంది. ఐనా.. దేనికి వెరవక యూరియా ఒక్కటి దొరికితే చాలు.! పంటలకు దిగుబడులు పెంచుకోవచ్చన్న ధ్యాసతో రైతన్నలు నానా యాతన పడుతున్నారు. అధికారులు మాత్రం ఈ సీజన్‌కు సరిపడ యూరియా ఉందని చెబుతున్నప్పటికి వారి మాటలపై వీరికి భరోసా కలగడం లేదు. అందుకే ముందుగా యూరియాను నిల్వ చేసుకుందామని క్యూలైన్‌లలో గంటల తరబడి వేచి చూస్తున్నారు.

యూరియా దొరకదని ప్రచారం జరుగుతుండడంతో రైతులు ముందస్తుగా యూరియా బస్తాల కోసం ఆడనక.. మగ అనక వర్షంలోనూ, రాత్రి సమయంలోనూ మండల కేంద్రానికి చేరుకుని దుకాణాల ముందు అరుగులపై నిద్రించి, తెల్లవారుజామునే సొసైటీ కేంద్రాల వద్దకు వెళ్లి క్యూలైన్‌లలో నిలబడుతున్నారు. ఆయా మండల కేంద్రాల్లో ఎక్కడ చూసినా రైతులే కన్పిస్తున్నారు. ప్రధానంగా ఏజెన్సీ మండలమైన గూడూరులో రైతులు భారీగా కనబడుతున్నారు. ఈ దండును చూసి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ రంగంలోకి దిగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సహాయక చర్యలు చేపడుతున్నారు. రైతుల గుంపులను ముందుగానే గమనించిన గూడూరు సొసైటీ నిర్వాహకులు రాత్రిపూట బారీకేడ్‌లు ఏర్పాటు చేయడం గమనార్హం. జిల్లాలోని గూడూరు, మహబూబాబాద్, కేసముద్రం మండలంలోని కల్వల, ఉప్పరపల్లి, పెనుగొండ, పెద్దవంగర, కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లిలో యూరియా కోసం రైతులు భారీగా కదిలారు.


గూడూరు సొసైటీ నుంచి యూరియా బస్తాను ఎత్తుకెళ్తున్న మహిళా రైతు


డోర్నకల్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్


గూడూరు సొసైటీలో టోకెన్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

గూడూరులో రంగంలో దిగిన ఎస్పీ..

గూడూరులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ముందస్తు రైతుల కోసం బారికేడ్‌లు ఏర్పాటుతో పాటు ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండ సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి రైతులు, మహిళ రైతులు దుప్పట్లు తీసుకుని గూడూరు మండల కేంద్రానికి చేరుకుని షాపుల ముందు అరుగులపై రాత్రి పడుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో లేచి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద క్యూలైన్ కట్టారు. అటవీశాఖ కార్యాలయం, జడ్పీహెచ్‌ఎస్, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. మగ రైతులకు.. మగ పోలీసులు.. మహిళ రైతులకు మహిళా పోలీసులు రక్షణగా ఉన్నారు.


మహబూబాబాద్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతులు భారీగా తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ స్వయంగా రంగంలో దిగారు. సొసైటీ ఛైర్మన్ చల్లా లింగారెడ్డితో కలిసి యూరియా సరఫరా, పంపిణీ పరిస్థితిపై సమీక్షించారు. గూడూరు ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ రికార్డుల్లో వ్యవసాయం చేసే భూమి తక్కువగా ఉందని, ఏజెన్సీ ప్రాంతంకావడం చేత వ్యవసాయం చేసే భూములు ప్రభుత్వ లెక్కల్లో లేకపోవడం వల్ల పంటలకు యూరియా బస్తాలు ఏ మూలకు సరిపోవడం లేదని, మండలానికి ఎక్కువగా యూరియా బస్తాలు కేటాయించాలని సొసైటీ ఛైర్మన్ చల్లా లింగారెడ్డి కోరారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా యూరియా బస్తాలు సరఫరా చేయాలని అధికారులను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశించారు. గూడూరు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా యూరియా బస్తాల పంపిణీకి టోకెన్లు ఇస్తూ పర్యవేక్షించారు. స్వయంగా పోలీసులే రైతుల ఆధార్‌కార్డులను (మిగతా 8లో..)

నిలిచిన అంతర్‌రాష్ట్ర రాకపోకలు

- టేకులగూడెం వద్ద జాతీయ రహదారిని ముంచెత్తిన వరద


అంతర్రాష్ట్ర రహదారిపై బైక్‌ను భుజాలపై మోసుకొస్తున్న యువకులు

వాజేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద ప్రవాహం పెరగటంతో అంతర్‌రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ టేకులగూడెం వద్ద రేకుమాగు వాగుకు వరద నీరు పోటెత్తి రహదారిని ముంచెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు ఆగిపోయాయి. వరద ప్రవాహంలో ఎవరూ దాటకుండా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. అలాగే పేరూరు-చంద్రుపట్ల మధ్య ఉన్న మరిమాగు వాగు ఉధృతి కారణంగా వంతెనపై వరద నీరు చేరింది. వాజేడు-గుమ్మడిదొడ్డి మధ్య ఉన్న కొంగాల వాగు ఉధృతి రోడ్డును వరద నీరు ముంచెత్తింది. అదేవిధంగా ఎడ్జర్లపల్లి-బొమ్మనపల్లి గ్రామాల మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కోయవీరాపురానికి వెళ్లే చాకలివాగు ఉధృతి కారణంగా ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. సీఐ ముత్యం రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఎస్సైలు జక్కుల సతీష్, కృష్ణప్రసాద్, ఆర్ఐ కుమారస్వామి లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రేమించిన యువకుడి ఇంటిపై దాడి 6

ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా విద్యుత్ శాఖ అధికారి విజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనతో రాష్ట్ర మంతటా విస్తారంగా కురుస్తున్న నేపద్యంలో రైతులు , గృహ వినియోగదారులు విద్యుత్ పట్ల అ ప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి విజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో తడిబట్టలను ,విద్యుత్ తీగలను తాకవద్దని సూచించారు. ఇళ్లలో తడినేలపై ఎలక్ట్రికల్ తీగ, పరికరాలు పడకుండా జాగ్రత్తంగా ఉండాలన్నారు.సెల్ ఫోన్ చార్జీంగ్ పెట్టి తడిచేతులతో తాకిన, మాట్లాడిన షాక్‌కు గురై మృతి చెందే ప్రమాదముందన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే 1912 నెంబరకు కాల్ చేయాలని సూచించారు.

భీమునిపాదం సందర్శించిన అటవీశాఖ అధికారులు

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సీతానగరం శివారు కొమ్ముల వంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతాన్ని గూడూరు అటవీ శాఖ ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి సురేష్ మంగళవారం సందర్శించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భీమునిపాదంలో వాటర్ ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నట్లు చెప్పారు. పర్యాటకులు జాగ్రత్తలు వహించాలని చెప్పారు. ఎఫ్ఎస్‌వో హట్యసింగ్, బేస్‌క్యాంప్ సిబ్బంది బాలాజీ, బోజ్యా, హరీష్ పాల్గొన్నారు.


భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్‌ను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

దేశంలో స్టార్టప్‌ల విప్లవం

- ప్రపంచంలోని స్కిల్డ్‌యూత్‌లో 40 శాతం మన దేశంలోనే..
- సాంకేతికంగా యువత ఆలోచనల్లో మార్పు వచ్చింది
- 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచ దేశాల బెంబేలు
- మన దేశం సత్తా ఏమిటో తెలిసింది
- కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారుడు జి.సతీష్‌రెడ్డి
- కేయూలో ఘనంగా ప్రారంభమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ


మాట్లాడుతున్న జి.సతీష్ రెడ్డి



తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలో పాల్గొన్న అతిథులు

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశ శక్తి అని, ఈ దేశాన్ని సాంకేతికంగా ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేది దేశ గతిని, స్థితి మార్చగలిగేది మన దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న యువత, విద్యార్థులేనని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారుడు, ప్రముఖ శాస్త్రవేత్త జి.సతీష్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సంతీష్‌రెడ్డి.. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి ప్లీనరీకి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి సుమారు 45 నిమిషాల పాటు స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ప్లీనరీకి వివిధ రాష్ట్రాల నుంచి 650 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో 1,100 యూనివర్సిటీలు ఉన్నాయని, వీటి ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు 4.3కోట్ల మంది అని, ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత మంది లేరన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు ఎన్నో ఉన్నాయని, అవే ఇప్పుడు దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాలో ప్రగతిపథంలో తీసుకువెళుతున్నాయన్నారు. ఒకప్పుడు దేశంలో వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు సెంట్రల్ యూనివర్సిటీలు ఉండేవని, కానీ ఇప్పుడు ప్రతీ రాష్ట్రంలో ఒక ఐఐటీ, ఒక ఐఐఎం, ఒక ఎన్ఐటీ అలాగే సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇవన్నీ ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విద్యా సంస్థలుగా (మిగతా 8లో..)



ఉప్పరపల్లి రైతువేదిక వద్ద యూరియా కోసం బారులుతీరిన రైతులు

ఉదయమే బారులు తీరిన రైతులు

● రెండు లారీల బస్తాల రాక ● అడిషనల్ కలెక్టర్ పరిశీలన

కేసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసముద్రం, ధన్నసరి సొసైటీ పరిధిలోని ఉప్పరపల్లి, కల్వల, పెనుగొండ, కేసముద్రంలో యూరియా టోకెన్ల కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. 222 బస్తాల చొప్పున నాలుగు కేంద్రాలకు రెండు లారీల్లో 888 బస్తాలు యూరియా రాగా ఒక్కో కేంద్రంలో వెయ్యిమందికిపైగా రైతులు ఉన్నారు. టోకెన్ల కోసం గంటల తరబడి క్యూలైనులో నిల్చుని టోకెన్లురాని రైతులు నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. జిల్లా రెవెన్యూ అడీషనల్ కలెక్టర్ కె.అనీల్‌కుమార్ రెండు సొసైటీలతోపాటు ఆయాగ్రామాల్లో సేల్స్‌పాయింట్లు, ప్రైవేటు వ్యాపారుల షాపులను పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని దశల వారీగా యూరియా వస్తోందని తెలిపారు. ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, సీఐ సర్వయ్య, డీటీ ఎర్రయ్య, ఏవో బి.వెంకన్న, ఎస్ఐలు మురళీధర్‌రాజు, కరుణాకర్, ఏఈవోలు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

యూరియా బ్లాక్ దందా

నెల్లికుదురు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియాను అధిక ధరలకు విక్రయించిన సంఘటన నెల్లికుదురు మండలంలోని నర్సింహులగూడెం క్రాస్‌రోడు వద్ద శరత్ ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్స్ షాపులో సోమవారం రాత్రి జరిగింది. ఆ ఫెర్టిలైజర్ షాపుకు ఓ కంపెనీ నుంచి 333 బస్తాల యూరియా వచ్చింది. రాత్రికి రాత్రే ఎమ్మార్పీ రేటుకన్నా అధిక ధరలకు షాపు డీలరు విక్రయించాడు. ఈ సంఘటన ఏవో యాస్మీన్ దృష్టికి రాగా, మంగళవారం షాపులో విచారణ చేపట్టారు. వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వకుండా యూరియాను విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని, ఎక్కువ ధరలకు విక్రయించిన ఎరువుల షాపు డీలరుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపగా లైసెన్స్ రద్దు చేసినట్లు ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు.

శ్రావణ్‌కు రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి



మంత్రి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శ్రావణ్

వెంకటాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఐఅండ్‌పీఆర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలానికి చెందిన ఫొటోగ్రాఫర్ తడండ్ల శ్రావణ్ కేటగిరి-2 ఇందిరమ్మ ఇల్లులో తృతీయ బహుమతి, కేటగిరి-4 రాజీవ్ యువ వికాసంలో కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పలు సంక్షేమ పథకాలపై తీసిన ఛాయాచిత్రాలకు పోటీ నిర్వహించగా అందులో ఇందిరమ్మ ఇల్లు ఫొటోకు తృతీయ బహుమతి, రాజీవ్ యువవికాసం ఫొటోలు ఎంపిక చేశారు. ఈ బహుమతిని ఆయన మంగళవారం హైదరాబాద్‌లో సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ సీహెచ్ ప్రియాంక, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా శ్రావణ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫొటోగ్రాఫర్లు, యాజమాన్యానికి శ్రావణ్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, శ్రావణ్ రాష్ట్ర, జాతీయస్థాయిలో 30కి పైగా అవార్డులు అందుకున్నారు.

యూరియా కోసం రైతన్న వెతలు

● వృద్ధుల నుంచి పిల్లల వరకు బారులు ● బస్తాలకోసం రాత్రి నుంచే పడిగాపులు ● పోలీస్ బందోబస్తు నడుమ పంపిణీ ● గూడూరు సొసైటీని సందర్శించిన ఎస్పీ

గూడూరు, (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు వర్షాకాలం.. పంటలకు యూరియా వేయాల్సిన కీలక సమయం.. మరోవైపు రైతుల అవసరానికి సరిపడ రాని యూరియాతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో యూరియా స్థానిక అవసరాలకు ఎంత మాత్రం సరిపోయేదిగా లేకపోవడంతో వచ్చిన కొద్దిపాటి యూరియా కోసం రైతన్నలు క్యూలైన్‌లో పోటీ పడుతున్నారు. సొసైటీకి వందల సంఖ్యలో యూరియా బస్తాలు వస్తుండడం, రైతులు మాత్రం వేల సంఖ్యలో వస్తుండడంతో అందరికి బస్తాలు అందించలేని పరిస్థితి నెలకొంది. గూడూరు సొసైటీకి 1200 యూరియా బస్తాలు రాగా, సుమారు 2 వేల మంది రైతులు క్యూలైన్‌లో నిరీక్షించారు. కొంత మంది రైతులు పంపిణీకి ఒకరోజు ముందే గూడూరుకు చేరుకుని సొసైటీ, దుకాణ సముదాయల ఎదుటనే పడుకున్నారు. వందలాది మంది రైతులు ఉదయం 6 గంట నుంచే సొసైటీ వద్దకు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తూ యూరియా బస్తాల విక్రయాలను కొనసాగించారు.



గూడూరు బాలుర పాఠశాలలోయూరియా కోసం వచ్చిన రైతులను కట్టడి చేస్తున్న కానిస్టేబుల్



యూరియా బస్తాలు పంపిణీ చేసే దుకాణ సముదాయం ఎదుట సోమవారం రాత్రి నిద్రిస్తున్న మహిళా రైతులు

ఆధార్ కార్డులతో మహిళ రైతులు, వృద్ధులు, యువకులు, రైతు పిల్లలు సైతం క్యూలైన్ నిలబడ్డారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిన రైతులు తిండి.. నీళ్లు మరిచి యూరియా కోసం నిరీక్షించారు. ఒక్కొక్క బస్తా చొప్పున ఒక్కో రైతుకు పంపిణీ చేయగా 1200 బస్తాలను రైతులకు అందించారు. మిగతా రైతులకు టోకెన్‌లను జారీ చేశారు. దీంతో యూరియా బస్తాలు రాని రైతులు నిరాశతో ఇంటిముఖం దారి పట్టారు. యూరియా బస్తాల కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గూడూరు అటవీశాఖ కార్యాలయం, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ప్రతీ వందమందికి ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి రైతులకు టోకెన్‌లు అందించారు. యూరియా బస్తాల పంపిణీని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పరిశీలించి అధికారులకు, పోలీసులకు తగు సూచనల చేశారు. డీఎస్పీ తిరుపతిరావు, సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, డీసీవో వెంకటేశ్వర్‌రావు, ఏవో అబ్దుల్ మాలిక్, తహసీల్దార్ నాగభవాని, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, సీఐ సూర్యప్రకాష్, ఎస్సై గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు యూరియా అందిస్తాం

● సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి

గూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియా పంపిణీ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు యూరియా బస్తాలను అందిస్తామని గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లింగారెడ్డి మాట్లాడారు. ప్రతి రైతుకు యూరియా అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. గూడూరు ఏజెన్సీ మండలంలో 60 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 30 వేల ఎకరాల వ్యవసాయ భూమి మాత్రమే రికార్డుల్లో ఉన్నట్లు చెప్పారు. రెవెన్యూ రికార్డులకు అనుగుణంగానే యూరియా బస్తాలను కేటాయించినట్లు చెప్పారు. రైతులు ఓపిగ్గా ఉండాలని, ప్రతిరైతుకు యూరియా బస్తాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. రెండో డోసులో రైతులు నానో యూరియాను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీవో వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ లింగారెడ్డి



కాటారం- మేడారం రోడ్డులో కేశాపూర్ పెద్దవాగు లోలెవల్ కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

లోలెవల్ కల్వర్టులను పరిశీలించిన కలెక్టర్

మహాముత్తారం, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రానికి సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద కోనంపేట వాగు లోలెవల్ కల్వర్టును, కాటారం మేడారం రోడ్డులో కేశాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ కల్వర్టును కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాలు వచ్చినపుడు లోలెవల్ కల్వర్టులతో మండలంలో ప్రజా రవాణా నిలిచిపోతోందని, అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ వర్షంతో వాగులు ప్రవహిస్తున్నపుడు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వరద ఉన్నపుడు రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్లను ఉంచాలని సూచించారు. ఆయన వెంట కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మహాముత్తారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ రమేష్, పీఆర్‌డీఈ రవీందర్, ఎంఈవో రవీందర్‌రెడ్డి ఉన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. కాటారం మేడారం రోడ్డులోని అలుగువాగు, కేశాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ కల్వర్టులను సందర్శించారు. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వరద సమయంలో వాగుల వద్ద ప్రజలు రోడ్డు దాటకుండా తగు ఏర్పాటు చేయాలని ఎస్సై మహేందర్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట కాటారం సీఐ నాగార్జునరావు ఉన్నారు.

వైద్యాధికారులతో నీతి ఆయోగ్ నోడల్ అధికారి భేటీ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ అత్యంత వెనుకబడిన బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా పలిమెల మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఇండికేటర్స్ అభివృద్ధి సెంట్రల్ నోడల్ అధికారి డాక్టర్ రమణ వైద్యాధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఎంవో మధుసూదన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై పీపీటీ ద్వారా వివరించారు. ఈనెల 23 వరకు నీతి ఆయోగ్ అధికారి జిల్లాలో పర్యటించనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. పీహెచ్‌సీలు, పల్లెదవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, డాక్టర్లు ఉమాదేవి, ప్రమోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వాహనంలో తరలిస్తున్న అడవి పంది పట్టివేత

రఘునాథపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అడవిపందిని వాహనంలో తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. రఘునాథపల్లి శివారు దొడ్డిగుట్ట అటవీ ప్రాంతంలో అడవి పందిని పట్టుకుని తాళ్లతో కట్టి వాహనంలో తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు కోమల్ల టోల్ ప్లాజా వద్ద పట్టుకున్నారు. దాన్ని తరలిస్తున్న కూరాకుల రమేష్, కడమంచి మహేష్‌ను కానిస్టేబుళ్లు యుగంధర్, సాయికుమార్ అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అడవి పందిని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శోభారాణి, బీట్ ఆఫీసర్ రమేష్‌కు అప్పగించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

● సాగుకోసం రూ.4లక్షల వరకు అప్పు

● ఈనెల 13న ఆత్మహత్యాయత్నం..

చికిత్స పొందుతూ మృతి

● జనగామ జిల్లా కంబాలకుంటతండాలో ఘటన

పాలకుర్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం సిరిసన్నగూడెం శివారు కంబాలకుంట తండాలో జరిగింది. ఎస్సై యాకూబ్ హుస్సేన్ కథనం ప్రకారం.



బీక్యా (ఫైల్)

కంబాల కుంటతండాకు చెందిన బానోతు బీక్యా (57) తనకున్న రెండెకరాల్లో ఎకరం పత్తి, ఎకరం మిర్చి సాగు చేశాడు. మిర్చి పంటకు దిగుబడి రాక పోవడంతో తెచ్చిన రూ.4లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలంటూ కుటుంబంలో చిన్నచిన్న గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బీక్యా ఈనెల 13న వ్యవసాయ క్షేత్రంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐటీడీఏ పీవో పరిశీలన

కాటారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా మంగళవారం సందర్శించారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యసేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. పీహెచ్‌సీలో సౌకర్యాలు, సమస్యలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, డీఐవో ప్రమోద్, పీహెచ్‌సీ సిబ్బంది రస్యా, పుష్ప, కృపావరం తదితరులు ఉన్నారు.

పగడపల్లి ఆశ్రమ పాఠశాల సందర్శన

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా సందర్శించారు. వంట గదిలో పరిశుభ్రత, స్టోర్‌రూం, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. పాఠశాలలో జరుగుతున్న భవనాల మరమ్మతు పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఏటీడీవో క్షేత్రయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న పీవో చిత్రామిశ్రా



రహదారిపైకి మరోవైపు దూసుకొచ్చిన కారును తొలగిస్తున్న సిబ్బంది

హైవేపై ప్రమాదం

● రోడ్ క్రాస్ చేస్తున్న స్కూల్ బస్సు

● వేగంగా దూసుకొచ్చి అదుపుతప్పిన రెండు కార్లు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు క్రాస్ చేస్తున్న స్కూల్ బస్సును తప్పించే క్రమంలో వేగం నియంత్రణ కాకపోవడంతో రెండు కార్లు రాంగ్‌రూట్‌లోకి దూసుకొచ్చిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. ప్రైవేటు స్కూల్ బస్సు రోడ్డు క్రాస్ చేస్తుండగా, హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వేగంగా వస్తున్న రెండు కార్ల వేగం నియంత్రణ కాకపోవడంతో జాతీయ రహదారికి మరోవైపునకు (రాంగ్ రూట్‌లోకి) దూసుకెళ్లాయి.

ఇన్నోవా కార్ డివైడర్‌ను ఢీ కొట్టి దూసుకెళ్లాయి. రాంగ్‌రూట్‌లోకి కార్లు దూసుకెళ్లిన సమయంలో ఆ వైపు నుంచి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఇన్నోవా క్రిస్టా కారు ముందు టైర్ పేగిలిపోగా, నెక్సాన్‌కారు ముందువీల్ విరిగిపోయి రహదారి మధ్య నిలిచింది. దీంతో రహదారి పైన సుమారు 20నిమిషాల పాటు ట్రాఫిక్‌జామ్ అయింది. ఎన్‌హెచ్ సిబ్బంది కారును తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. ఇన్నోవా వాహనంలో కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి ప్రయాణిస్తున్నాడు. రెండు కార్లలో ఉన్నవారెవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కొయ్యూరు మీదుగా బస్వాపూర్ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు మేడిపల్లి టోల్‌గేట్ వద్ద కాపు కాశారు. ఆరు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసినట్లు వెల్లడించారు. భూపాలపల్లికి చెందిన నాలుగు, గంగారం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7660	5300
మక్కలు	2100	1521
కందులు	5832	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	5500	3450
పల్లికాయ (పచ్చిది)	4900	1575
పసుపు (కాడి)	10198	9534
పసుపు (గోల)	10008	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	14000	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్341ఏసీ	14200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం


ప్రేమించిన యువకుడి ఇంటిపై దాడి

తొమ్మిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు

యువతి తండ్రితో సహా ముగ్గురి రిమాండ్

తొర్రూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంపై రెండు కుటుంబాలకు చెందిన సభ్యుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో యువతి కుటుంబ సభ్యులు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసు తెలిపారు. ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం, వెల్లికట్టె గ్రామానికి చెందిన కొమ్ము అజయ్ అదే గ్రామానికి చెందిన ఏశబోయిన రాములు కుమార్తె లావణ్య గత కొంతకాలంగా ప్రేమించుకొని జూలై 23న వివాహం చేసుకొని హైదరాబాద్‌లో అద్దె గృహంలో నివాసం ఉంటున్నారు. సోమవారం స్వగ్రామానికి వచ్చారనే విషయం తెలుసుకున్న యువతి తల్లి యాకమ్మ వెళ్లి నచ్చ చెప్పి ఇంటికి రావాలని ఒత్తిడి చేసింది.

దీంతో యువతి నిరాకరించడంతో యువతి తల్లి ప్రేమించిన యువకుడిని, కుటుంబ సభ్యులను తిడుతూ వెళ్లిపోయింది. రాత్రివేళ కాలనీలో అందరూ నిద్రిస్తుండగా ఒక్కసారిగా యువతి కుటుంబ సభ్యులు, బంధు వులు ఇట్టుకలు, కత్తిపీటలు, కర్రలతో యువకుడి తల్లి దండ్రులపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడిలో యువకుడి తండ్రి వెంకన్న పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరిలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అజయ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఏశబోయిన రాములు, ఏశబోయిన యాకమ్మ, ఏశబోయిన సాయికుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు బత్తుల సోమయ్య, ఏశబోయిన శ్రీను, ఏశబోయిన సాయి లు, బత్తుల కోమలత, బత్తుల వెంకటమ్మ, పోసాని యాకయ్యపై హత్యా యత్నం కేసు నమోదు చేసి ముగ్గురి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.



గాయపడిన వెంకన్న



ఫార్మసీ సదస్సులో మాట్లాడుతున్న సరళాదేవి

టీబీ నిరోధక ఔషధాల తయారీకి ముందడుగు

హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నిరోధన ఔషధాల తయారీలో కీలక ముందడుగు పడిందని హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందకూరి ప్రకటించారు. మంగళవారం కేయూ ఆడిటోరియంలో మధ్యాహ్నం జరిగిన ప్లీనరీసెషన్‌లో డాక్టర్ వినయ్ కె.నందకూరి మాట్లాడారు. మైకోబాక్టీరియాతో క్షయవ్యాధి సోకుతుందని ట్యాబర్క్‌లోటస్‌లో ఔషధ నిరోధకత పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో క్షయను నిరోధిస్తామని స్పష్టం చేశారు. సదస్సుకు టీసీఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మోహన్‌రావు అధ్యక్షుడిగా వ్యవరించగా సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు ప్రెసిడింగ్ చేశారు.

గర్భాశయ క్యాన్సర్‌ను జయించవచ్చు..

మహిళలు గర్భాశయ క్యాన్సర్‌ను జయించవచ్చునని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల స్త్రీల వైద్య నిపుణురాలు ప్రొఫెసర్ రమా సరళాదేవి సూచించారు. మంగళవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సెషన్‌లో సరళాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. పీసీఓడీ, గర్భాశయ క్యాన్సర్ అండ్రోజన్ అధిక ఉత్పత్తి, జంక్ ఫుడ్ వల్ల వస్తోందన్నారు. 17 ఏళ్లలోపు పెళ్లిల్లు అయ్యే ఆడపిల్లలకు హుమన్‌పాపిలో వైరస్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిరోధకానికి గార్డసిల్ 4, 9, హెచ్‌పీ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. పొగతో మగపిల్లల్లో ఓరల్, ఆనల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐఐటీసీ సీనియర్ సైంటిస్టు డాక్టర్ నాగారపు లింగయ్య మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్, టీబీ వ్యాధులకు సరసమైన ధరల్లో ఔషధాల తయారీ జరుగుతోందని చెప్పారు. గోమూత్రంతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చునన్నారు. కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ వై.నరసింహరెడ్డిలు, జానపరెడ్డి కృష్ణవేణి, ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, ప్రొఫెసర్ స్వరూపలు ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు.

కాగా ఫిజిక్స్ సెమినార్ హాల్‌లో యూజీసీ డీఏఈ సీఎస్ఆర్ ముంబయి మాజీ డైరెక్టర్ డాక్టర్ వసుదేవా సిరిగురి, హైదరాబాద్ ఎన్ఆర్ఎస్ ఎస్ఎఫ్ సైంటిస్టు డాక్టర్ వైకే సుబ్రహ్మణ్యం, మ్యాథ్స్ సెమినార్ హాల్‌లో ఐఐటీ ఖరగ్‌పూర్ గణితశాస్త్ర ప్రొఫెసర్ ఎన్.గణేశ్వర్, ఓయూ గణితం రిటైర్డు ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, కామర్స్ సెమినార్ హాల్‌లో ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, భారత ప్రభుత్వ ఏఐసీటీఈ అడ్వయిజర్, మెంబర్ సెక్రటరీ (వీసీ) ప్రొఫెసర్ మోరె రాములు, కెమిస్ట్రీ విభాగం సెమినార్ హాల్‌లో ఏఎంపీఆర్‌ఈ, సీఎస్ఐఆర్ భూపాల్ ప్రొఫెసర్ తల్లాడ భాస్కర్, హైదరాబాద్ బిట్స్ పిలానీ ఎమెరిటస్ ప్రొఫెసర్ బీఎం రెడ్డి, జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో హైదరాబాద్ ఎన్ఐఎన్, ఐసీఎంఆర్ సైంటిస్టు - ఎఫ్ డాక్టర్ కె.రాజేందర్‌రావులు ప్రసంగాలు నిర్వహించారు. కేయూ సెనెట్ హాల్‌లో హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది నిట్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ సుంకరిజ్యోతిల నేతృత్వంలో సదస్సు జరిగింది. సైన్స్ అభివృద్ధిపై కీలక ప్రసంగాలు చేశారు.

ఏఐ, డీప్ లర్నింగ్‌లతో అధునిక రక్షణ కృషి

ఏఐ, డీప్ లర్నింగ్ వంటి అధునిక సాంకేతిక రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరగుతున్నాయని డీఆర్‌ఓఈ, ఎల్ఆర్‌డీఓ బెంగళూరు డైరెక్టర్ డాక్టర్ జి.విశ్వం అన్నారు. దేశ రక్షణకు సాంకేతిక రంగం కీలకమన్నారు. డీఆర్‌డీఏ రక్షణకు పరిశోధనలు చేస్తోందన్నారు. అకాడమీలు, పరిశ్రమలు, వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుంటోందని తెలిపారు. వికసిస్ భరత్ 2047 లక్ష్య సాధనకు స్టార్ట్ అప్ మిషన్లను ఉత్సాహంగా నడుపుతామని చెప్పారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో యువత సత్తా చాటాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి

- డిజిటల్ విప్లవంతో గొప్ప మార్పులు
- మల్టిపుల్ అప్రోచ్‌తో ముందుకు సాగాలి
- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి
- తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలు ప్రారంభం



గిరిజన సంప్రదాయ నృత్యాకారులతో సతీశ్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రం, ఈసం నారాయణ తదితరులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో యువత నైపుణ్యాలతో సత్తా చాటాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి ఉద్బోధించారు. కేయూలో మూడు రోజుల పాటు జరిగే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాల మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేయూ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిజిటల్ విప్లవంతో గొప్ప మార్పులు వస్తున్నాయని చెప్పారు. యువత మల్టిపుల్ అప్రోచ్‌తో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. నైపుణ్యాలు పెంచుకుని సాధికారికత సాధించాలన్నారు. దేశ యువత విద్య, వైజ్ఞానిక రంగాల్లో ప్రపంచానికి పోటీగా నిలుస్తోందని చెప్పారు. సైన్స్ క్రమబద్ధమైన అధ్యయనమని, టెక్నాలజీతో అన్ని రంగాల్లో ప్రాధాన్యత వహిస్తోందన్నారు. నాగరికతలో ప్రతీ తరంలో గొప్పమార్పులు వస్తున్నాని విశ్లేషించారు. 17, 18, 19 శతాబ్దంలో వచ్చిన మార్పులు 20 శతాబ్దంలో డిజిటల్ రంగంలో ప్రతిఫలిస్తున్నాయని అన్నారు. దేశంలో యువత 60 శాతం మేరకు ఉందన్నారు.

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సు కేయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు గుర్తుగా టీసీఎస్-25, కేయూ సంయుక్తంగా నిర్వహిస్తోందన్నారు. సంక్షేమం, సేవ, సైన్స్ లక్ష్యంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్యాంటం ఫిజిక్స్ ఎన్విరాల్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అడిగిడుతోందన్నారు. వికసిత్ భారత్ - 2047 దిశగా తెలంగాణ రైజింగ్ సాగుతోందన్నారు. శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇండస్ట్రీల కలయిక అవసరమన్నారు. కేయూ పూర్వ విద్యార్థుల సంబంధాలను బలోపేతం చేసేందుకు అట్లాంటా, న్యూజెర్సీ, టెక్సాస్ (యూఎస్ఏ)లతో సహా ప్రపంచవ్యాప్తంగా గోల్డన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహిస్తామని వెల్లడించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 100 ఏళ్లకు చేరుతోందన్నారు. వర్సిటీ తెలంగాణ సైన్స్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. సామాజిక పరివర్తనకు సైన్స్ సాధనమన్నారు. దేశం సైన్స్‌కు కట్టుబడి ఉందన్నారు. దేశంలో స్వాతంత్ర్య అనంతరం జీవన ప్రమాణం, అక్షరాస్యత పెరుగిందన్నారు. విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్ ఉండాలన్నారు. దేశ రక్షణ వ్యవస్థ బలమైందన్నారు. మన సత్తా ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు వర్సిటీలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ స్కిల్స్, ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మషన్ యంగ్ ఇండియాపై తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎంరెడ్డిలు సదస్సు ఉద్దేశాలను వివరించారు. వందన సమర్పణ చేశారు.

అబ్‌స్ట్రాక్టుల ఆవిష్కరణ

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ రెండో జాతీయ సదస్సును పురస్కరించుకుని ముద్రించిన పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్టులను సదస్సుల్లో పాల్గొన్న ముఖ్యఅతిథి భారత రక్షణమంత్రిత్వ శాఖ సలహాదారు, డీఆర్‌డీఏ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి, అతిథులు బాలక్రిష్ణారెడ్డి, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మోహన్‌రావు, సత్యనారాయణ, ప్రొఫెసర్ సీహెచ్ సంజీవరెడ్డి, డాక్టర్ నాగపూరి వేణుగోపాల్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే టీసీఎస్ సహకారంతో వెలువరించిన రిటైర్డు రేడియో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగపూరి వేణుగోపాల్ వెలువరించిన భారతదేశంలో తొలి వనిత వైద్యులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేయూ జియాలజీ అల్యూమినీ ఏజీఎస్ రెడ్డి రూపొందించిన ది రిసెర్చర్స్ కంపాస్ పుస్తకాన్ని అతిథులు స్టేజీపై ఆవిష్కరించారు.

గుస్సాడీ నృత్యాలు సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందుకూరి, డీఆర్‌డీఓ బెంగళూరు ఎల్ఆర్‌డీఈ డైరెక్టర్ జి.విశ్వం నేతృత్వంలో ప్లీనరీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కె.అనితారెడ్డి, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజు, నల్లగొండలోని మహాత్మాగాంధీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హాత్తాప్ హుస్సేన్, కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్లు ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ జి.హన్మంతు, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ట్రెజరర్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి.రమేశ్ ప్రొఫెసర్ ఈ. రాజనరేందర్, సత్తయ్య, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్, తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సంకినేని వెంకట్, చాడ రాధికారెడ్డి, దీపాజ్యోతి, మంద వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



:హాజరైన ప్రొఫెసర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు

రూ.కోటి అప్పులు చేసి ఉడాయించిన వ్యాపారి?

ఆన్‌లైన్ గేమ్‌లు.. వ్యాపారంలో నష్టాలే కారణం

జనగామ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లు, వ్యాపారంలో నష్టాల కారణంగా ఓ వ్యాపారి అప్పుల పాలై సుమారు రూ.కోటి పైగా అప్పుచేసి ఉడాయించిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో జరిగినట్టు ప్రచారం సాగుతోంది. జనగామలోని సూర్యాపేట రోడ్డులో చిల్లర కాంటా వ్యాపారం నిర్వహించే స్థానిక 50 ఏళ్ల వ్యాపారి ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటు పడి, అప్పులు తెచ్చి మరీ గేమ్స్ ఆడేవాడని తెలుస్తోంది.

దీనికి తోడు తాను నిర్వహించే వ్యాపారంలోనూ తీవ్ర నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయని సమాచారం. సుమారు రూ.కోటికి పైగా అప్పులు కావడంతో సోమవారం రాత్రికిరాత్రే ఉడాయించినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. వ్యాపారి ఉడాయించిన విషయం తెలియడంతో అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటూ మొత్తుకుంటున్నారు. కొన్నేళ్ల నుంచి అద్దెఇంట్లో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పీఎంఏవై-జీ ఇళ్లల్లో భద్రత డొల్ల

లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) కింద గ్రామాల్లో నిర్మించిన ఇళ్లలో భద్రతా సమస్యలు ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు.

మంగళవారం లోక్‌సభలో ఎంపీ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇళ్ల నిర్మాణం సరిగా లేకపోవడం, విద్యుత్ సమస్యలతో ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారని అన్నారు. 2021 నుంచి ఇప్పటివరకు పీఎంఏవై-జీ కింద దేశంలో ఎన్ని ఇళ్లలో ఇటువంటి సమస్యలు ఉన్నాయో రాష్ట్రాల వారీగా వివరాలను కావ్య అడిగారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్ల భద్రతపై ఎలాంటి చర్యలు చేపట్టారో వాటి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. పీఎజేవై-జీ పథకం వల్ల గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనాలు ఉన్నప్పటికీ వారి భద్రతా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. బలహీన వర్గాల కుటుంబాలు ప్రమాదంలో పడకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ పీఎంఏవై-జీ పథకం కింద లబ్ధిదారులకు 1.20 లక్షల నుంచి 1.30లక్షల వరకు ఇల్లు కట్టుకోవడానికి సహాయం ఇస్తున్నట్టు చెప్పారు.

స్థానిక మేస్త్రీలతో ఇళ్లు కట్టించడానికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఫిర్యాదులు వస్తే 15 రోజుల్లో పరిష్కరించే విధానం ఉందని తెలిపారు.

రుణ పునరుద్ధరణ బంగారమాయేనా!

(5వ పేజీ తరువాయి)

రూ.3లక్షలకు మించి బంగారు అభరణాలపై రుణాలు ఇవ్వకపోవటంతో తన పేరుతో పాటు భార్య, పిల్లలు, తల్లిదండ్రుల పేరు మీద కూడా బంగారం తాకట్టు పెట్టి అప్పులు తీసుకవస్తున్నారు. అయితే పంట దిగుబడి రాకపోవటంతోపాటు పిల్లల చదువులు, పెళ్లిలకు ఖర్చులు పెరుగుతుండటంతో బ్యాంకుల్లో అప్పులు అలాగే మిగిలిపోతున్నాయి. రైతులకు గత ఏడాది వరకు కూడా అప్పులకు వడ్డీ చెల్లిస్తే బ్యాంకర్లు రెన్యువల్ చేసేవారు. అయితే ప్రస్తుతం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలను తీసుకరావటంతో గోల్డ్ లోన్ రెన్యువల్‌లో అడ్డంకులు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్యాంకు రుణం తీర్చేందుకు అప్పులు

రైతులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. దీంతోపాటు పాత అప్పులకు వడ్డీలు కట్టి కొత్తగా అప్పులు తీసుకునేందుకు రైతులు బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. అయితే బంగారు రుణాలను తాకట్టు పెట్టి కాస్తంతా ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకోవాలనుకునే రైతులకు నిరాశే మిగులుతోంది. గోల్డ్ లోన్ రెన్యువల్ చేయాలంటే.. అసలుతో పాటు వడ్డీ కూడా కలిపి మొత్తం చెల్లించాలని బ్యాంకర్లు మెలిక పెడుతున్నారు. ఆర్‌బీఐ కొత్త నిబంధనల ప్రకారం అసలు, వడ్డీ చెల్లిస్తేనే గోల్డ్ రుణాలు రెన్యువల్ చేస్తామని కరాఖండిగా చెప్పుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక పెట్టుబడికి అప్పుల కోసం బ్యాంకులకు వెళ్లిన రైతులకు పాత బాకీ అసలు, వడ్డీ చెల్లించాలని కోరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూపాలపల్లిలోని ఓ జాతీయ బ్యాంకులో కొమురయ్య అనే రైతు బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రూ2,99,000 అప్పు తీసుకున్నారు. ఇందుకు రూ.27,514 వడ్డీ అయింది. అసలు, వడ్డీ మొత్తం కలిపి 3,26,514 చెల్లిస్తేనే తిరిగి రుణం రెన్యువల్ చేస్తామని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఒకటి రెండు రోజుల్లోనే అంత మొత్తాన్ని తీసుకువచ్చి బ్యాంకులో చెల్లించి, రుణాన్ని రెన్యువల్ చేసుకునే స్థోమత లేక సదరు రైతు ప్రవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. అసలు, వడ్డీ చెల్లిస్తే ఒకటి, రెండు రోజుల్లో కొత్తగా రుణాన్ని ఇస్తామని బ్యాకర్లు చెప్పుతున్నప్పటికీ రైతు మాత్రం ఐదారు రోజుల్లో చెల్లిస్తామని రోజుకు లక్షకు వెయ్యి చొప్పున మూడు లక్షలకు రూ.3వేలు చెల్లించాల్సి వస్తుందని సదరు రైతు వాపోతున్నారు. ఇలా ఐదు రోజులకు రూ.15వేల వరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారి చేతిలో పెట్టాల్సి వస్తోంది. అంటే రూ.3లక్షలకు ఏడాదికి రూ.27వేలు చెల్లిస్తే.. ప్రవేటు వడ్డీ వ్యాపారికి ఐదు రోజులకే రూ.15వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. బ్యాంకు వడ్డీ, ప్రవేటు వ్యాపారి వడ్డీ కలిపితే రూ.42వేలకు పైగా అవుతుండటంతో రైతుల కష్టం మిత్తీల పాలవుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్న చోట్ల అప్పులు ఇచ్చేందుకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు కూడా లేకపోవటంతో కొంత మంది బ్యాంకు సిబ్బంది వడ్డీ వ్యాపారుల పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. లక్షకు వెయ్యి చొప్పున అప్పు ఇచ్చి.. రుణం రాగానే వసూలు చేసుకుంటున్నారట.


ఆర్‌బీఐ నిబంధన కొంతమంది బ్యాంకర్లకు వడ్డీ వ్యాపారంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇంకొన్ని చోట్ల గోల్డ్ లోన్‌కు సంబంధించిన అసలు లేకపోవటంతో రైతులు బంగారు అభరణాలను వేలం వేస్తామంటూ బ్యాంకుల నుంచి నోటీసులు, ఫోన్ కాల్స్ మెసేజ్‌లు కూడా వస్తున్నాయని ఆందోళన రైతులు చెందుతున్నారు. ఖరీఫ్ పంటలో సాగు బాట పట్టాల్సిన రైతులు.. బ్యాంకు రుణం తీర్చేందుకు ప్రవేటు వడ్డీ వ్యాపారుల ఇంటి చుట్టూ తిరుగాల్సి వస్తోందని వాపోతున్నారు.

పాత విధానమే మేలు

గోల్డ్ లోన్ విషయంలో పాత విధానాన్నే బ్యాంకర్లు అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. బంగారు అభరణాలను తాకట్టు పెట్టుకుని ఇచ్చే రుణాలకు అసలు కట్టకుండానే మిత్తీ చెల్లిస్తే, రుణాన్ని రెన్యువల్ చేసేవారు. దీంతో రైతులకు కూడా పెద్దగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యేవి కావని పేర్కొంటున్నారు.

బంగారం ధర పెరిగితే.. పెరిగిన ధరకు అనుగుణంగా లోన్ మొత్తం కూడా పెరిగేది. రైతుకు అవసరమయితే పెరిగిన బంగారం ధరకు అనుగుణంగా లోన్ మొత్తాన్ని పెంచి ఇచ్చే వారు. ప్రస్తుతం అసలు, వడ్డీ చెల్లించాలనే నిబంధన ఉండటంతో బంగారం ధర పెరిగిన లోన్ పెంచి ఇస్తామని బ్యాంకర్లు అంటున్నా.. రైతులు ససేమేరా అంటున్నారు. అసలు, వడ్డీ చెల్లించాలనే నిబంధనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్‌బీఐ దృష్టికి రైతుల ఆర్థిక పరిస్థితిని తీసుకెళ్లి.. బంగారు రుణాలను పాత పద్ధతిలో రెన్యువల్ చేసేలా ఒప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు లేవనెత్తి రైతుల పక్షాన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేటు వడ్డీలకు తెచ్చి రెన్యూవల్ చేసుకున్నా..



వర్ధన్నపేటలోని కెనరా బ్యాంకులో కొన్ని నెలల కిందట బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాను. పట్టాదారు పాసు పుస్తకం పెడితే ఎక్కువ రుణం అందించారు. ఇటీవల బంగారం రుణం రెన్యూవల్ చేయాలని బ్యాంకుకు వెళ్లగా, రెన్యూవల్ చేయాలంటే మొత్తం అమౌంట్ కట్టాలని బ్యాంకు అధికారులు సూచించారు. ఇదేంటని ప్రశ్నించగా మూడు నెలల నుంచి ఆర్బీఐ రూల్స్ మారాయని చెపుతున్నారు. దీంతో బయట వడ్డీకి తెచ్చి.. బంగారు రుణాన్ని రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చింది. చాలామంది రైతులు ఈ విధానంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

\- దుబాసి సందీప్, వర్ధన్నపేట

ఉధృతంగా గోదావరి

- పేరూరు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో...
- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఉరకలేస్తున్న ప్రవాహం



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

ఏటూరునాగారం రూరల్/మహదేవపూర్/వాజేడు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలో చేరువలో ఉంది. గోదావరిలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో మరితంగాపెరిగే అవకాశమున్నట్లు జలవనరుల శాఖ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటూరునాగారంలోని ముంపు ప్రాంతాలైన ఎస్సీకాలనీ, ఓడవాడలోని ప్రజలకు అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగపేట మండలం కమలాపురంలోని ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌టేక్‌వెల్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు సముద్రమట్టానికి 8 మీటర్లు ఉండగా సాయంత్రానికి 6 గంటలకు 8.30 మీటర్లు నీటి మట్టం చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాజేడు మండలంలో గోదావరి వేగంగా పెరిగింది. పేరూరు వద్ద సాయంత్రం 6 గంటలకు 17.67 మీటర్లకు నీటిమట్టం చేరింది. గోదావరి ప్రవాహం కారణంగా అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా మండలంలోని అంతర్గత రోడ్ల మీదకు గోదావరి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి వేగంగా పెరుగుతోంది. బ్యారేజీ మొత్తం 59 గేట్లను ఎత్తి దిగువను నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 7,46,328 క్యూసెక్కులు ఉంది.

కాళేశ్వరం వద్ద..

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉరకలెస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఎగువ మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున వరద రావడం, తెలంగాణలో కురుస్తున్న వరుస వర్షాలకు గోదావరికి వరద పోటెత్తెంది. మంగళవారం గోదావరి 10.50 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. వరద పోటుకు జ్ఞాన తీర్థం విగ్రహాలు సగం మునిగాయి. మంగళవారం ఉదయం నుంచే గోదావరి వరద పోటు జోరుగా సాగుతోంది.

ములుగు జిల్లాలో 98.4 మి.మీ.

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు జిల్లాలో సగటు వర్షపాతం 98.4 మి.మీటర్లు నమోదైంది. అత్యధికంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో 187.2 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా ములుగు జిల్లా కేంద్రంలో 28.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. వెంకటాపూర్ మండలంలో 28.2, తాడ్వాయి 113.6, గోవిందరావుపేట 36.8, కన్నాయిగూడెం 105.2, వాజేడు 78.4, వెంకటాపురం 145.2, మంగపేట 162.2 మి.మీ. వర్షపాతం రికార్డయింది.

పేరూరు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ములుగు జిల్లాలోని వాజేడు మండలంలో పేరూరు వద్ద గోదావరి ప్రమాద స్థాయి చేరుకుంది. మంగళవారం 15.750 మీటర్ల నీటమట్టం నమోదుకాగా రాత్రి 9 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికగా 16.100 మీటర్లు నమోదైందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కన్నాయిగుడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్లను ఎత్తి వేయటంతో గోదావరికి వరద నీరు పోటేత్తింది. దీంతో మండలం లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు రాత్రి వేళ పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో 38.6 మి.మీ. వర్షపాతం

కృష్ణకాలనీ(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం కురిసింది. సింగరేణి ఏరియాలోని ఓసీ-2, ఓసీ-3లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. పలిమెల మండలంలో అత్యధికంగా 87.2 మి.మీ.వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా రేగొండ మండలంలో 21.0 మి.మీటర్ల వర్షపాతం రికార్డు అయ్యింది. జిల్లాలో సగటు వర్షపాతం 38.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 42.6, పలిమెలలో 87.2, మహముత్తారంలో 46.4, కాటారంలో 45.2 మల్హర్‌లో 28.4, చిట్యాల 27.6, టేకుమట్లలో 26.2, మొగుళ్లపల్లి 22.2, రేగొండ 21.0, గణపురం 21.2, భూపాలపల్లిలో 57.0, కొత్తపల్లిగోరి మండలంలో 12.3 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

కంటెంట్‌ను వినియోగించడం వరం

● జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి



ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల స్థాయిని పెంచేందుకు ప్రపంచంలోని పలు దేశాల్లో ఉపయోగిస్తున్న కంటెంట్‌ను ఇక్కడ వినియోగించడం విద్యార్థులకు ఒక వరమని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఖాన్ అకాడమీ తరగతులను ప్రభుత్వ పాఠశాలల్లో ఉపయోగించేందుకు కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సదర్భంగా డీఈవో మాట్లాడుతూ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్‌లో ఈ కంటెంట్ ఉపయోగించబడుతుందని చెప్పారు. విద్యాబోధనలో ప్రఖ్యాతి గాంచిన ఖాన్ అకాడమీ కంటెంట్‌ను ఉపయోగించేందుకు డిజిటల్ టెర్నింగ్, విద్యార్థుల్లో ఆలోచనాత్మక శక్తినిను పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ ఆజాద్, సంతోష్, జిల్లా సైన్స్ అధికారి బి. అప్పారావు,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

'కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్రం'

కేసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యూరియా కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ రాష్ట్ర రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. అమీనాపురంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన 9.80లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సిఉండగా అరకొరగా ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేవలం 5.32లక్షల టన్నులే పంపిందని తెలిపారు. సాగుకు అవసరమైన యూరియాను కేంద్రం ఎందుకు సరఫరా చేయడంలేదనేది బీజేపీ నాయకులు రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోసం కేంద్రంపై పోరు చేయాల్సిందిపోయి కొందరు ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీటీసీ భద్రు, శ్రీనివాస్ రెడ్డి, సామ సుధాకర్‌రెడ్డి, యార సాగర్, లకావత్ బాలు, కాసు సతీష్ ఉన్నారు.

'ఆన్‌లైన్'లో దరఖాస్తు చేసుకుంటేనే..

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు అనుమతి

● ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి విగ్రహం ఏర్పాటు, ఊరేగింపు కోసం రాష్ట్ర పోలీస్ వెబ్‌సైట్‌లో 'ఆన్‌లైన్' చేసుకుంటేనే అనుమతి ఉంటుందని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ నేపధ్యంలో భద్రత, బందోబస్తు కొరకే ఆన్‌లైన్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వాహకులు పోలీసు వారి నియమ నిబంధనలు పాటించి, గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో భాగంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు పాటించాల్సిన నియమాలు.

- మండపం ఏర్పాటు కోసం సంబంధిత శాఖల అధికారుల అనుమతి తప్పనిసరి.
- ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు విధిగా ఏర్పాటు చేయాలి.
- ప్రజా రవాణాకు, ఎమర్జెన్సీ వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి.
- రాత్రి 10 గంటల వరకే మైక్ సౌండ్స్ సిస్టమ్ ఉపయోగించాలి.
- మండపంలో 24 గంటలు వలెంటరి ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- భక్తుల సందర్శనను దృష్టిలో పెట్టుకొని క్యూలైన్ ఏర్పాటు చేయాలి.
- మండపంలో పాయింట్ పుస్తకం విధిగా నిర్వహించాలి
- పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 కాల్ చేయాలి.
- ప్రమాదావశాత్తు అగ్ని ప్రమాదం సంబవిస్తే ముందు జాగ్రత్త కోసం రెండు బకెట్ల నీళ్ల అందుబాటులో ఉంచాలి.
- గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు చేయడం, అన్యమతస్తులను కించపరచడం, విధంగా ప్రసంగాలు చేయడం, పాటలు పాడటంపై పూర్తి నిషేధం.
- గణేష్ శోభాయాత్రలో డిజే సౌండ్స్ ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయొద్దు.

రైల్వే క్యాబిన్ గేట్ మూసివేత

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండ-మానుకోట రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఎల్‌సీ నెంబర్ 80 గేటు వద్ద అభివృద్ధి పనులు చేయుటకు గాను 19వ తేదీ రాత్రి 9 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 6 గంటల వరకు రైల్వే క్యాబిన్ గేటు మూసివేయనున్నట్లు రైల్వేశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పనులు జరుగుతున్న ప్రదేశాలలో యంత్రాలతో పనులు చేపట్టనున్నందున ప్రత్యామ్నాయ రోడ్డును సైతం ఉపయోగిస్తున్నదున సహకరించాలని రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్‌అండ్‌బీ శాఖకు, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.

కేసముద్రం, గూడూరులో మోస్తారు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కేసముద్రం, గూడూరు మండలాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు 159.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురియగా, సగటున 10.0 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 24.4, గంగారంలో 21.2, బయ్యారంలో 8.2, గార్లలో 6.2, డోర్నకల్‌లో 9.2, కురవిలో 9.2, మహబూబాబాద్‌లో 7.4, గూడూరులో 19.0, కేసముద్రంలో 9.2, నెల్లికుదురులో 7.8, నర్సింహులపేటలో 8.0, చిన్నగూడూరులో 6.8, మరిపెడలో 7.4, దంతాలపల్లిలో 6.4, తొర్రూరులో 4.2, పెద్దవంగరలో 4.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అతిథి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

బయ్యారం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయంలో అతిథి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్‌టీ) ఆంగ్లం పోస్టుకు మహిళా అభ్యర్థులు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో దేవేంద్రాచారి మంగళవారం తెలిపారు. బీఏ, ఎంఏ ఇంగ్లీష్‌తో బీఈడీ ఆంగ్లం మెథడాలజీతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

యూరియాను బ్లాక్ చేస్తే చర్యలు

కొత్తగూడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియాను బ్లాక్ చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ప్రైవేట్ డీలర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు హెచ్చరించారు. కొత్తగూడలోని రైతు వేదికలో డీలర్లతో మండల టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు ఇవ్వాలని సూచించారు. స్టాక్‌బోర్డ్, స్టాక్ రిజిష్టర్‌లను, ఈ-పాస్‌ను అప్‌డేట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రతేకాధికారి సురేష్, తహసీల్దార్ రాజు, ఏవో ఉదయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లు తొలగించండి

● వీసీలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హన్మకొండ విద్యుత్‌భవన్ నుంచి విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది నుంచి విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ఆపరేటర్లకు చెప్పినప్పటికి వాటిని తొలగించడం లేదని, తక్షణమే వాటిని తొలగించాలని అధికారులకు సూచించారు. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాలను అధికారులు సందర్శించి, ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ లైన్లను క్లియర్ చేయాలని సూచించారు. వినాయక చవితి, దుర్గామాత పండుగలు వస్తున్న తరుణంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి పలు సూచనలు చేయాలన్నారు. ఎస్ఈ విజేందర్‌రెడ్డి, డీఈ విజయ్ పాల్గొన్నారు.

వినాయక మండలపాలను పరిశీలించిన డీఈ..



మానుకోటలో గణేష్ మండప నిర్వాహకులతో మాట్లాడుతున్న విద్యుత్ డీఈ విజయ్

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలతో మహబూబాబాద్ పట్టణంలో వినాయ మండపాలను విద్యుత్ శాఖ డీఈ విజయ్‌కుమార్ సందర్శించారు. మండల పాల నిర్వాహకులతో మాట్లాడారు. విగ్రహాలను వాహనాల్లో ఎక్కించే, దించే సమయాల్లో విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధుడి అరెస్ట్

నెల్లికుదురు ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా విక్రయిస్తున్న గంజాయిని మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. నెల్లికుదురు క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో కొడకండ్ల మండలం రేగులకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు కేలోత్ చందు అలియాస్ చందులాల్ రూ.70 వేలు విలువ చేసే కిలో 400 గ్రాముల గంజాయిని చిన్న ప్యాకెట్‌లు చేసి విక్రయించడానికి వెళ్తున్నాడు. దీంతో నెల్లికుదురు క్రాస్ రోడ్డు వద్ద పోలీస్‌లు పట్టుకున్నారు. గంజాయిని ఎక్కడ నుంచి తీసుకొస్తున్నావని విచారించగా తన చిన్నకుమారుడు కేలోత్ నవీన్ రాజమండ్రి నుంచి తీసుకవచ్చి తనకు విక్రయించడానికి ఇచ్చాడని తెలిపాడు. గంజాయిని స్వాధీనం చేసుకోని వృద్ధుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

యూరియా కోసం క్యూ

(5వ పేజీ తరువాయి)

పరిశీలించి యూరియా టోకెన్‌లను అందించారు. 1200 యూరియా బస్తాలు సొసైటీకి రాగా, ఆ బస్తాలను రైతులకు పంపిణీ చేసి మరో 500 బస్తాలకు టోకెన్‌లను అందించారు.

డోర్నకల్‌లో ఫర్టిలైజర్‌షాపు తనిఖీ చేసిన కలెక్టర్..

డోర్నకల్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మలతో కలిసి బాలాజీ ఫర్టిలైజర్స్, వీరవెంకట సత్యనారాయణ ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ఈ పాస్ మిషన్‌లో ఉన్న వివరాలు, రిజిస్టర్‌లో రాసివున్న వివరాల్లో తేడా ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యూరియా కృత్రిమ కొరత సృష్టించవద్దని, యూరియాను అధిక ధరలకు విక్రయించవద్దని హెచ్చరించారు. కొత్తగూడలో పొగుళ్లపల్లిలో 444 యూరియా బస్తాలు వచ్చాయి. ప్రత్యేక అధికారి సురేష్, తహసీల్దార్ రాజు, మండల వ్యవసాయాధికారి ఉదయ్, ఎస్సై రాజు పర్యవేక్షణలో యూరియా బస్తాల పంపిణీ చేశారు.

కేసముద్రంలో ఉప్పరపల్లి, కల్వల, పెనుగొండ గ్రామాల్లో యూరియా బస్తాల కోసం ఉదయం 7 గంటల నుంచే సొసైటీ వద్ద బారులు తీరారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తాచొప్పున ఒక్కొక్క కేంద్రంలో 222 బస్తాలను పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, ఏడీఏ శ్రీనివాస్ రావు, ఏవో వెంకన్నతో కలిసి కేసముద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి యూరియా నిల్వలను పరిశీలించారు.



కల్వలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మహబూబాబాద్‌లో తెల్లవారుజామునుంచే రైతులు పీఏసీఎస్ ముందు యూరియా కోసం బారులు తీరారు. 880 బస్తాల యూరియా రాగా, సుమారు 2 వేల మంది రైతులు ఉండగా 880 మందికి ఒక్కొక్కటి చొప్పున యూరియా బస్తాలను పంపిణీ చేశారు. క్యూలైన్‌లో నిలబడ్డ 400 మంది రైతులకు టోకెన్‌లు ఇవ్వగా మిగతా 600 మందికి పైగా ఉన్న రైతులు నిరాశతో ఇంటి ముఖం పట్టారు. మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి, తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ రావు, సీఐ మహేందర్‌రెడ్డి, ఆరుగురు ఎస్సైలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్షం పడుతున్నప్పటికి రైతులకు టోకెన్‌లను అందించారు. పెద్దవంగర మండలం కేంద్రం, బావోజీతండాలో కొంతమందికి రెండు బస్తాలు, కొంతమందికి ఒక్కో బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు.

నెల్లికుదురు పీఏసీఎస్ ఎదుట ధర్నా..

నెల్లికుదురు మండలంలో యూరియా అందించాలని పీఏసీఎస్ ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బాబుగౌడ్, యాకయ్య, నర్సయ్య, పుల్లయ్య ఆధ్వర్యంలో ఈ ధర్నా కొనసాగింది. తప్పుడు ప్రచారంతో యూరియా ఇక రాదని, కొరత ఉందని జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రచారం జరుగుతుండడంతో రైతులు భారీగా యూరియా కోసం తరలివస్తున్నారు. మహిళ రైతులు కూడా రాత్రనకా.. పగలనకా.. యూరియా బస్తాల కోసం నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

యూరియా ఇబ్బంది లేదు.

● విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి



జిల్లాలో యూరియాకు ఎలాంటి ఇబ్బంది లేదు. సోమవారం ఒక రాక్ యూరియా వచ్చింది. రేపో.. ఎల్లుండో.. మరో రాక్ యూరియా వస్తుంది. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. ముందుగా కొనుక్కుని యూరియాను నిల్వ పెట్టుకోవద్దు. యూరియాను మోతాదకు మించి వేయొద్దు.. ప్రస్తుతం నానో యూరియా వాడితే మంచిది.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. స్థానిక రెడిన్ కలర్ ల్యాబ్ భవనంపై సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు తోట సుభాష్ ఆవిష్కరించారు. తొలుత ఫొటో కెమెరా సృష్టి కర్త డాగూరే చిత్రపటానికి అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపేటి లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్లంతా ఐకమత్యంతో ఉంటూ హక్కులను సాధించుకోవాలని చెప్పారు. ఫొటోగ్రాఫర్ల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కనుమరుగవుతున్న కళలను కాపాడుకోవాలన్నారు.



మానుకోటలో జెండాను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నేతలు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

● మహబూబాబాద్ టౌన్ : మహబూబాబాద్ పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు జిల్లెలముడి మురళీమోహన్, చుక్కల పరమేశ్వర్‌ను శాలువాలతో సత్కరించారు. చాయచిత్రాలు ఉపయోగపడుతాయని చెప్పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బీవీరన్న, ప్రధాన కార్యదర్శి పర్కాల రవీందర్‌రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, అనుమాల వెంకటేశ్వర్లు, రావుల రవిచందర్‌రెడ్డి, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, చాపల రంజిత్‌రెడ్డి, వమ్మి సనాతనాచారి, సిద్ధార్థ పాల్గొన్నారు.

● మరిపెడ : మరిపెడ మున్సిపల్ కేంద్రంలో మంగళవారం స్థానిక ఫొటోగ్రాఫర్లు ఫొటోగ్రఫీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫొటో పితామహుడు డాగ్యురే చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ విశిష్టతలను గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా ట్రైబల్ ఇయర్ అఫ్ ది అవార్డు అందుకున్న మరిపెడ ఫొటోగ్రాఫర్ ఫక్రుద్దీన్‌ను సహచర ఫొటోగ్రాఫర్లు సత్కరించారు. జాటోత్ నరేశ్, వీరభద్ర, లింగన్న, రవి, బ్రహ్మం, రాజు, సునీల్, మధు, సాయి, గణేశ్, హన్మంతు, దశరథ పాల్గొన్నారు.

● తొర్రూరు : చరిత్రలో నిలిచిపోయే ఫొటోలను సమాజానికి అందిస్తున్న ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని తొర్రూరు యూనియన్ అధ్యక్షుడు మెరుగు కరుణాకర్, లయన్స్ క్లబ్ తొర్రూరు అధ్యక్షుడు రాంనర్సయ్య అన్నారు. తొర్రూరులో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అసోసియేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రా చారి, కార్యదర్శి రవికుమార్, సాయి, సేవాతరుణి అధ్యక్షురాలు శ్రీదేవి, చిదిరాల నవీన్, నాగవాణి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

దేశంలో స్టార్టప్‌ల విప్లవం

(5వ పేజీ తరువాయి)

వెలుగొందుతున్నాయన్నారు. సైన్సును మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా ఈ రంగంలో వినూత్న ఆవిష్కరణ లక్ష్యంగా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. టెక్నాలజీ పరంగానే కాకుండా పరిశోధన, విద్యారంగాల్లోనూ సమాంతరంగా ముందుకు వెళ్లేందుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సంస్థను కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు.

మన దేశంలో ఇప్పుడు స్టార్టప్ విప్లవం కొనసాగుతోందన్నారు. యువత స్టార్టప్‌ల పట్ల మొగ్గుచూపుతోందన్నారు. పట్టణాలే కాదు.. గ్రామాలు, మారుమూల పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం వినూత్నంగా ఆలోచిస్తున్నారని, సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారాలు చుడుతున్నారన్నారు. 2016లో దేశంలో 456 స్టార్టప్‌లు ఉండగా ప్రస్తుతం 1.57 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. యావత్ ప్రపంచం ఇప్పుడు భారత దేశ యువతవైపు చూస్తోందని, వారి వినూత్న ఆవిష్కరణలను ఆసక్తిగా గమనిస్తోందని, తగిన అవకాశాలు ఇచ్చి వారి శక్తియుక్తులను వాడుకోవడానికి ముందుకు వస్తోందన్నారు.

మనం ఎక్కడ పుట్టాం.. ఎక్కడి నుంచి వచ్చామనేది ముఖ్యం కాదని, మన ఆలోచనలు ఎంత వినూత్నంగా ఉన్నాయనేది ప్రధానం అన్నారు. మారుమూల ప్రాంతాల్లో పుట్టిపెరిగిన కొందరు యువకులు సరికొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు ప్రారంభించి రూ.వందల కోట్లకు అధిపతులయ్యారని అన్నారు. డీఆర్‌డీఏలో పని చేస్తున్న ఓ చిరుద్యోగి కొడుకు బెంగుళూరుకు చెందిన అనిరుధ్ ఏర్పాటు చేసిన స్పేస్ స్టార్టప్, కర్నాటకలోని ఒక చిన్నపల్లె నుంచి వచ్చిన సోహన్ గోపీనాథ్ సైబర్ టెక్నాలజీకి సంబంధించిన గ్లోబల్ స్టార్టప్, గ్రామీణ ప్రాంతానికి చెందిన మరో యువకుడి ప్రొపెల్లెంట్ స్టార్టప్‌లు ఇందుకు ఉదాహరణలన్నారు.

రాబోయే కాలంలో క్వాంటమ్ టెక్నాలజీ ప్రాధాన్యత సంతరించుకోనున్నదన్నారు. ఈ రంగాల్లో స్టార్టప్‌లు అనేకం రానున్నాయన్నారు. డీప్ టెక్ పట్ల దృష్టి సారించినప్పుడే మరింతగా రాణించగలుతామన్నారు. భవిష్యత్తులో ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువతలో 40 శాతం మంది మన దేశంవారే ఉంటారన్నారు. వినూత్న సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు కీలక భూమిక పోషించాలని పిలుపు నిచ్చారు.

ఆపరేషన్ సిందూర్‌తో సాంకేతికంగా మన దేశం సత్తా ఏమిటనేది ప్రపంచానికి తెలిసిందని సతీష్ రెడ్డి చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో మన ఉపయోగించిన అత్యాధునిక సాంకేతికత చూసి యావత్ ప్రపంచ నివ్వెరపోయిందన్నారు. ఇజ్రాయిల్ లాంటి దేశాలు ఐరన్ డోం రక్షణ వ్యవస్థను వాడుకుంటే మన దేశం దానికి మించి దేశ భద్రతకు ఆపరేషన్ సిందూర్‌లో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించిందన్నారు. శత్రుదేశపు ప్రతీ క్షిపణిని, డ్రోన్‌ను, విమానాన్ని తిప్పికొట్టిందని, రాడార్ వ్యవస్థలను, ఉగ్రవాదుల బంకర్లను ధ్వంసం చేసిందని అన్నారు. శత్రు దేశం రాడార్‌లను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ధ్వంసంచేసే ఆధునాతన సాంకేతిక వ్యవస్థ రూపకల్పనలో పాలుపంచుకున్న రాడార్ నిపుణుల్లో ఒకరైన విశ్వం సభలో ఉండగా ఆయనను సతీష్ రెడ్డి ప్లీనరీకి హాజరైన ప్రతినిధులకు స్వయంగా పరిచయం చేశారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. కిందటేడు రూ.24వేల కోట్ల ఉత్పత్తులను ఎగుమతి చేయగా ఈ యేడు ప్రధాని మోదీ సూచన మేరకు ఈ మొత్తం రూ.50వేల కోట్ల పెరగనున్నదని చెప్పారు.

ఈ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి, టీఎఎస్ మాజీ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ మోహన్ రావు, టీఏఎస్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సత్యనారాయణ, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, టీఏఎస్ కోశాధికారి ప్రొఫెసర్ ఎస్‌ఎంరెడ్డి, టీఏసీ నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ బి.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పాక్సో కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బాలిక కిడ్నాప్ కేసులో ఇద్దరు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రంలోని హన్మంతుని గడ్డకు చెందిన డోలి విజయ్‌కుమార్, షేక్ అబిద్‌పాష ఇద్దరు స్నేహితులు కలిసి పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలికను ఈనెల 12న రాత్రి సమయంలో కిడ్నాప్ చేశారు.

ఈనెల 15న బాలిక తల్లి విజయ్‌కుమార్, షేక్ అబిద్ పాషపై అనుమానంగా టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో కిడ్నాప్ చేసిన బాలికను ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి ములుగుకు వెళ్లారు. ములుగు నుంచి వరంగల్‌కు వస్తున్న క్రమంలో వరంగల్ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ క్రమంలో బాలికను అక్కడ వదిలేసి పారిపోతుండగా చాకచక్యంగా వ్యవహరించి పట్టుకొన్నామని, మైనర్ బాలికను కిడ్నప్ చేసి అత్యాచారం చేసి డోలి విజయ్‌కుమార్, అతనికి సహకరించిన అతని స్నేహితుడు షేక్ అబిద్‌పాషపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల నేతలు

'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్‌తో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న హన్మకొండ అంబేద్కర్ భవన్‌లో జరుపతలపెట్టిన బహిరంగసభను జయప్రదం చేయాలని వేదిక రాష్ట్ర కోకన్వీనర్ గుగులోతు కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం బహిరంగసభ పోస్టర్లను ఆవిష్కరించారు. వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు పాయం చిన్నచంద్రన్న, హాలావత్ లింగన్న, దుడ్డెల రాంమూర్తి, కొత్తపల్లి రవి, మైన శ్రీనివాస్, గుగులోతు హరినాయక్, సామ పాపయ్య, ఆలకుంట్ల సాయిలు, బత్తుల పాపన్న, ఎనుగుతల ఉప్పలయ్య, చేపూరి గణేష్, వాంకుడోతు ఉపేందర్, కేశ లింగన్న, మమ్మద్ వాహెద్, మోషా పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

డోర్నకల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మునిసిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా బోధన చేయాలన్నారు. అనంతరం డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో రోజు అవుట్ పేషెంట్‌లు ఎంతమంది వస్తున్నారని వైద్యాధికారిణి సాధ్విజాను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులు ఎన్ని నమోదయ్యాయని ఆరా తీశారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పినిరెడ్డిగూడెంలో యువతి ఆత్మహత్య



మేఘన(ఫైల్)

గార్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ మేఘన (17) అనే యువతి మంగళవారంఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రియాజ్ పాష తెలిపిన ప్రకారం. మేఘన హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత పదేళ్ల కిందట తండ్రి అనారోగ్యంతో చనిపోగా, రెండేళ్ల క్రితం తల్లీ చనిపోయింది. నాటి నుంచి మేఘన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువు కొనసాగిస్తుంది. రాఖీ పండుగ రోజున హైదరాబాద్ నుంచి బాబాయ్ కొడుకు రాఖీ కట్టాలని వచ్చిన మేఘన తల్లితండ్రి లేరని మనోవేదనతో బాధపడుతూ, అప్పటి నుంచి కాలేజీకి పోకుండా ఉండిపోయింది. ఈనెల 10న ఇంట్లో ఎవరు లేని సమయంలో యాసిడ్ తాగి కేకలు వేయడంతో ఆమెను గార్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలు అన్న గుగులోత్ వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

డోర్నకల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నారుమడి ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని రాజుతండాకు చెందిన గుగులోతు లక్ష్మి తనకున్న పొలంలో వరినారు పోశారు. అదే తండాకు చెందిన నవీన్ అనే యువకుడు ట్రాక్టర్‌తో వరినారుమడిని ధ్వంసం చేశాడు. దీంతో బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. అమ్మపాలెంకు చెందిన రాందేని నాగేశ్వర్‌రావు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన కిరణ్, శివ, బసవయ్య, నరేష్, సురేష్ సోమవారం దాడి చేశారు. ఈ ఘటనలో నాగేశ్వర్‌రావు తలకు గాయమైంది. బాధితుడు నాగేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్‌కే బీచ్‌కు ప్రత్యేక బస్సులు

తొర్రూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాలోని విశాఖ ఆర్‌కే బీచ్‌కు తొర్రూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 21న తొర్రూరు డిపో నుంచి రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి అన్నవరం, సింహాచలం, ఆర్‌కేబీచ్, సామర్లకోట, పిఠాపురం, విజయవాడ కనక దుర్గ, పెనుగంచిప్రోలు ఆలయాలు దర్శించుకుని 24న తిరిగి తొర్రూరుకు వస్తుందన్నిరు. పెద్దలకు రూ.2500, పిల్లలకు రూ.1300 నిర్ణయించడం జరిగిందని, మరిన్ని వివరాలకు 7032182456, 9959226053 నంబరులో సంప్రదించాలన్నారు.